# సాక్షి
## కుమురం భీం

ఆదివారం । 4 । ఆగస్టు । 2024




**ప్రకృతివనంపై గొడ్డలివేటు**

పల్లె ప్రకృతివనాల్లోని చెట్లకు రక్షణ కరువైంది. ఏపుగా పెరిగిన చెట్లను నరికివేస్తుండగా అధికారులు పట్టించుకుంటలేరు. 9లో▸



**దరఖాస్తులు పరిష్కరించాలి**

భూసమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ వీసీలో కలెక్టర్‌కు సూచించారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /25.0

**వాతావరణం**

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వాన కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### టీజీబీలో చోరీకి యత్నం



పోలీసుల అదుపులో నిందితుడు

దహెగాం: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో చోరీ యత్నం జరిగింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి బ్యాంక్ తలుపులు పగులగొడుతున్న సమయంలో శబ్దం రాగా భవన యజమాని మేనేజర్ నవీన్‌కుమార్‌కు సమాచారం ఇచ్చాడు. మేనేజర్ సిబ్బందితో బ్యాంక్ వద్దకు చేరుకుని పోలీసుకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి బ్యాంక్‌లో దూరిన వ్యక్తి పారిపోయాడు. సీసీ కెమెరా రికార్డును పరిశీలించి ఫొటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీంతో మండలంలోని చిన్న ఐనం గ్రామానికి చెందిన అల్లకొండ రమేశ్‌గా గుర్తించారు. గ్రామస్తుల సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, బ్యాంక్ రీజినల్ సీనియర్ మేనేజర్ రాజేశ్ బ్యాంక్‌ను సందర్శించారు. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. కాగా, నిందితుడు కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయినట్లు పలువురు పేర్కొన్నారు.

### ‘స్వచ్ఛదనం-పచ్చదనం’ అమలుకు స్పెషలాఫీసర్లు

కైలాస్‌నగర్: ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు ఇద్దరు ఐఏఎస్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ జీ రవి, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కే ఇలంబరిదిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వీరిద్దరు ఇది వరకు ఉమ్మడి జిల్లాలో సేవలందించారు. జీ రవి ఆదిలాబాద్ ఆర్డీవోగా పనిచేయగా, ఇలంబరిది ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈవో, ఐటీడీఏ పీవో, నిర్మల్ కలెక్టర్‌గానూ సేవలందించారు. వీరికి ఉమ్మడి జిల్లాపై పూర్తి అవగాహన ఉంది. ఆయా జిల్లాల్లో ఐదురోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని వీరు పర్యవేక్షించనున్నారు.

# వచ్చేదెవరు..?



- అడుగులకు మడుగులొత్తేదెవరు?
- పోలీస్‌శాఖపై ‘అధికార’ నేతల కన్ను
- పోస్టింగ్‌లకు అధికారుల బారులు
- పట్టుకోసం ఇద్దరు నేతల యత్నం
- నేతల మధ్య నలుగుతున్న పోలీసులు

సాక్షి, ఆసిఫాబాద్: ఎన్నికల క్రతువు పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధుల కన్ను పోలీస్ అధికారుల బదిలీలపై పడింది. తమకు అనుకూలంగా వ్యవహరిస్తూ, అడుగులకు మడుగులొత్తే వారు ఎవరున్నారా.. అని జిల్లాలోని అధికారపార్టీ నేతలు కొందరు వెతుకులాట ప్రారంభించారు. అయితే.. మీకోసం మేమున్నామంటూ కొందరు అధికారులు ఇప్పటికే నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. జిల్లాలో అధికారపార్టీకి చెందినవారెవరూ గెలవకపోవడంతో.. పార్టీ ప్రెసిడెంట్, ఇన్‌చార్జీలు జిల్లాపై పట్టుకోసం ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఇన్‌చార్జీలు ప్రతిపాదించిన జాబితాను పార్టీ అధ్యక్షుడు పక్కన పెడుతుండగా.. పార్టీ అధ్యక్షుడు ప్రతిపాదించిన పేర్లపై నియోజకవర్గ ఇన్‌చార్జీలు కొర్రీలు పెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాకు రావాలనుకుంటున్న పోలీస్ అధికారులు అధికారపార్టీ నేతల తీరుతో బెంబేలెత్తిపోతున్నారు. తమ బదిలీలను మార్చుకోవడానికి సిద్ధపడుతున్నారన్న సమాచారం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**ఎవరి ప్రయత్నాల్లో వారు..**

జిల్లాలో ఈ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన నేత ఒకరు ఈ విషయంలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. పోలీస్ బదిలీల్లో తమకు అనుకూలంగా ఉండే అధికారులను నియమించుకునేందుకు తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. ఈపాటికే పలువురితో సంప్రదింపులు జరిపారు. జిల్లా పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న నేత మాత్రం ఓటమిపాలైన నేత సిఫార్సులను తిప్పికొడుతున్నారు. ఇటీవల జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే ఓ స్టేషన్‌కు సీఐగా ఓ అధికారి ఓటమి పాలైన నేత సిఫార్సుతో పోస్టింగ్ తెచ్చుకుంటే.. ఆ అధికారిని విధుల్లో చేరొద్దంటూ పార్టీ పెద్దదిక్కు హుకూం జారీ చేయడంతో చేసేదేమీలేక అతడు విధుల్లో జాయిన్ కాకపోవడం గమనార్హం. ఇలా ఇరువురు నేతల మధ్య పోలీస్ అధికారులు నలిగిపోతున్నట్లు తెలుస్తోంది. ఎవరితో మాట్లాడితే ఎవరికి కోపం వస్తుందోనన్న భయంతో ప్రయత్నాలు కూడా చేయకుండా మిన్నకుండి పోతున్నట్లు సమాచారం. అయితే జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుచరుల చుట్టూ మరికొందరు పోలీస్ అధికారులు ప్రదక్షిణలు ప్రారంభించినట్లు సమాచారం. తాము ఇన్నాళ్లుగా అప్రాధాన్య పోస్టింగ్‌లో ఉన్నామని, ఇప్పుడైనా తమను గుర్తుంచుకుని న్యాయం చేయాలని కోరుతున్నట్లు తెలిసింది. రెండురోజుల కిందట వాంకిడి సీఐ శ్రీనివాస్‌ను కరీంనగర్‌కు బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయగా.. ఆయన స్థానంలో కమిషనరేట్ పరిధిలోనే పనిచేస్తున్న బుద్ధ రవి అనే సీఐ వస్తున్నట్లు సమాచారం. అలాగే బదిలీపై వెళ్లిన జైనూరు సీఐ స్థానంలో డీసీఆర్‌బీ సీఐ రమేశ్‌ను నియమించనున్నట్లు తెలుస్తోంది.

**ఎస్సైలకు కూడా స్థానచలనం**

జిల్లాలో పలువురు ఎస్సైలకు కూడా స్థానం చలనం కలగనున్నట్లు తెలిసింది. వాంకిడి ఎస్సై సాగర్‌ను రెబ్బెనకు, ఆయన స్థానంలో జగదీశ్‌గౌడ్‌ను, తిర్యాణి ఎస్సైగా మాధవ్‌గౌడ్‌ను, బెజ్జూరు ఎస్సైగా రామకృష్ణను, చింతలమానేపల్లి ఎస్సైగా పనిచేస్తూ వీఆర్‌కు వెళ్లిన నరేశ్ స్థానంలో మరో ఎస్సై నరేశ్‌ను బదిలీ చేసేందుకు పోలీస్ బాస్ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలో వీరికి బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశమున్నట్లు సమాచారం.

### ఎస్సైల నుంచి డీఎస్పీల దాకా..

ఎస్సైలు మాత్రమే కాదు.. నియోజకవర్గస్థాయిలో కీలకపాత్ర వహించే సీఐలతోపాటు డీఎస్పీ పోస్టింగ్‌లకు కూడా గిరాకీ పెరిగింది. జిల్లాలో ఎస్సై, సీఐ హోదాల్లో పనిచేసిన పలువురు అధికారులు ప్రస్తుతం డీఎస్పీలుగా ఏసీబీ, సీఐడీ లాంటి లూప్‌లైన్ పోస్టింగ్‌ల్లో ఉన్నారు. వీరిలో పలువురు ఇప్పటికే తమకు అనుకూలమైన పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. నాయకులకు బాగా సన్నిహితంగా వ్యవహరించే ద్వితీయశ్రేణి నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో జిల్లాలో చక్రం తిప్పే నేత ఎవరనే విషయమై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. మరికొందరైతే తాజా ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేసి ఓటమి పాలై.. నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా కొనసాగుతున్న నేతలను ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

### ఇప్పటికే ఆశావహులపై వల

జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారుల్లో అధిక శాతం కొత్తవారే. ఎన్నికల నిబంధనల్లో భాగంగా వారంతా జిల్లాకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఎన్నికల క్రతువు ముగిసింది. బదిలీలపై నిషేధం ఎత్తివేశారు. ఈ తరుణంలో జిల్లావ్యాప్తంగా సీఐలు, ఎస్సైల బదిలీలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తమకు అనుకూలంగా వ్యవహరించే అధికారుల కోసం అధికారపార్టీ నేతలు వెతుకులాట ప్రారంభించారు. వివిధ వర్గాల నుంచి పూర్తిస్థాయిలో సమాచారం సేకరించి.. క్షేత్రస్థాయిలో అత్యంత కీలక బాధ్యతలు నిర్వహించే సీఐలు, ఎస్సైల్లో తమకు అనుకూలంగా వ్యవహరించే వారు ఎవరున్నారనే విషయమై దృష్టి సారించారు. సామాజిక వర్గం కోణంలోనూ ఇప్పటికే అధికారులను గుర్తించారు. ‘మీ గురించి ఇప్పటికే విచారించాం.. మంచివారని తెలిసింది. మీకు పోస్టింగ్ వేయించే బాధ్యత మాది.. అలాగని ప్రతి చిన్న పనికీ మిమ్మల్ని ఇబ్బంది పెట్టం.. కీలకమైన సమయాల్లో మాకు అనుకూలంగా వ్యవహరిస్తే చాలు.. దీనికి మీరు అంగీకరిస్తే పోస్టింగ్ వేయించే బాధ్యత మాది’ అంటూ జిల్లాకు చెందిన అధికార పార్టీ నాయకులు ఇప్పటికే ఆశావహులపై వల విసురుతున్నారు.

# ‘మత్తు’ రానీయకుండా..



కెరమెరి హైస్కూల్‌లో మత్తు పదార్థాలపై కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న కమిటీ సభ్యుడు

- డ్రగ్స్ వాడకంపై ప్రత్యేక నిఘా
- హైస్కూళ్లలో ప్రహరీ క్లబ్‌లు

కెరమెరి(ఆసిఫాబాద్): హైస్కూల్ స్థాయిలో కొందరు విద్యార్థులు మాదవ ద్రవ్యాలకు బానిసై భవిష్యత్‌ను అంధకారమయం చేసుకుంటున్నారు. అలాంటివారిని దారిలోకి తెచ్చేందుకు, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేందుకు విద్యాశాఖ జీవో ఎంఎస్ నంబర్ 20 జారీ చేసింది. జెడ్పీ హైస్కూళ్లలో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసింది. చురుకైన విద్యార్థులను క్లబ్‌లో నియమించి వారి ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఎవరెవరు చెడు వ్యసనాల బారిన పడ్డారో తెలుసుకుని వారిని వాటి నుంచి బయటపడేసేందుకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమం పక్కా అమలు చేసి విద్యార్థులను గంజాయి, గుట్కా, సిగరెట్లు, మత్తుపానీయాల బారిన పడకుండా చూడాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

**16 మంది సభ్యులతో కమిటీ**

జిల్లాలోని 58 ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న ప్రహరీ క్లబ్ కమిటీల్లో చురుకైన విద్యార్థులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ క్లబ్‌కు అధ్యక్షుడిగా హెచ్‌ఎం, ఉపాధ్యక్షుడిగా సీనియర్ ఉపాధ్యాయుడు లేదా విద్యార్థులతో సాన్నిహిత్యం ఉన్న ఉపాధ్యాయుడిని నియమించారు. ప్రతీ తరగతి నుంచి ఇద్దరు చురుకైన విద్యార్థులు, పోలీస్‌స్టేషన్ నుంచి ఒకరు, పేరెంట్స్, టీచర్స్ నుంచి ఒకరు.. ఇలా కమిటీలో మొత్తం 16 మంది సభ్యులుంటారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై కమిటీ సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని డీఈవో పీ అశోక్ తెలిపారు.

### కమిటీ విధులు ఇవే..

- విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా నిఘా పెట్టడం.
- పాఠశాలలు, విద్య, శిశుసంరక్షణ సంస్థల పరిసర ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలను అరికట్టడం.
- పిల్లలను మాదక ద్రవ్యాల నుంచి దూరం చేయడం.
- మత్తు పదార్థాలకు ఉపయోగించే ఔషధాలు, పదార్థాలు, ఇతర వస్తువులు పిల్లలకు చేరకుండా నిరోధించడం.
- విద్యార్థులు ఈ ఊబిలో చిక్కకుండా ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం.

### అవగాహన కల్పిస్తున్నాం



ప్రార్థన సమయం.. తరగతి గది.. లేదా ప్రత్యేక సమావేశాల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారంతో అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూస్తున్నాం.

– అంజలి, కమిటీ సభ్యురాలు, జెడ్పీఎస్ఎస్ గోయగాం

# స్నేహమంటే ఇదేరా..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులంతా స్నేహానికి మారుపేరుగా నిలుస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి చదువుకుంటున్నారు. తల్లిదండ్రులను విడిచి వచ్చి హాస్టళ్లలో ఉంటున్నారు. స్నేహం విలువ తెలిసిన వారు ఎప్పుడూ మిత్రులను దూరం చేసుకోరని చెబుతున్నారు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్నేహం గురించి ఫైనలియర్ విద్యార్థినులు తెలిపిన అభిప్రాయాలు వారి మాటల్లోనే..



ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలుపుతూ గ్రూప్ ఫొటో

- ప్రాంతాలు వేరైనా ప్రాణస్నేహితుల్లా..
- బాధలు ఎన్నొచ్చినా భరోసానిస్తూ..
- ‘మైత్రి’కి మారుపేరుగా నిలుస్తూ..
- ఫ్రెండ్‌షిప్ చేస్తున్న బాలికలు
- ‘సాక్షి’తో అనుభవాలు పంచుకున్న గిరిజన డిగ్రీ కాలేజీ విద్యార్థినులు
- నేడు స్నేహితుల దినోత్సవం



ఐక్యత చాటుతున్న విద్యార్థినులు

### మాది 12ఏళ్ల స్నేహం



మేము ఐదోతరగతి నుంచి డిగ్రీ వరకూ కలిసే చదువుకుంటున్నాం. 12 ఏళ్ల స్నేహం మాది. సెలవుల్లో ఇంటికి వెళ్లినా రోజూ ఫోన్‌లో మాట్లాడకుండా ఉండలేం. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒకరికి ఒకరు తోడుంటాం.

– కవిత

### బాధలు మరిచిపోతాం



హాస్టల్‌లో ఉన్నప్పుడు తల్లిదండ్రులు మనతో ఉండరు. వారిని మరిచిపోయేలా చేసే స్నేహితులున్నారు నాకు. చాలా సంతోషం అనిపిస్తుంది. ఎన్ని బాధలున్నా మంచి మిత్రులుంటే మరిచిపోతాం. బంధువులకంటే స్నేహమే గొప్పది.

– సాయిశ్రీ

### వేరే ఆలోచన రాదు



మా గ్రూప్‌లోని అందరం కలిసిమెలిసి ఉంటాం. దీంతో మాకు చదువు తప్ప మరో ఆలోచన రాదు. హాస్టల్‌లో అందరితో స్నేహంగా ఉంటే ఎలాంటి బాధలు, సమస్యలు రావు. అందుకే స్నేహితులుగా మారి సంతోషంగా ఉండాలి.

– పార్వతి

### బాధలు పంచుకుంటున్నారు



నేను ఫస్టియర్‌లో హాస్టల్‌కు వచ్చిన. కళాశాలలో ఎవరి పరిచయం లేదు. తల్లిదండ్రులను వదిలి ఉండలేను అనిపించింది. ఇంటికి వెళ్లిపోతానని నిర్ణయించుకున్న. మా క్లాస్‌లో సంధ్యారాణి, ప్రేమల, కీర్తన పరిచయమయ్యాక నాతో కలిసి నా బాధలు పంచుకుంటున్నారు. ప్రస్తుతం ఫైనలియర్ చదువుకుంటున్నాం. స్నేహబంధంతో అన్నీ మరిచి సంతోషంగా ఉంటున్నాం.

– స్నేహితులతో కావ్య

### మరువలేని స్నేహితులున్నారు



ఇక్కడ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసిన నుంచి మేము ముగ్గురం కళాశాలలో విధులు నిర్వహిస్తున్నాం. మంచి స్నేహితులుగా ఉంటున్నాం. కులం.. కులం.. గురుకులం. ఈ గురుకులంలో మా ముగ్గురి ప్రాణం ఒక్కటే అన్నంతగా స్నేహం చేస్తున్నాం. భాష లేనిది.. బంధం ఉన్నది.. సృష్టిలో అతి మధురమైనది స్నేహం. జీవితంలో మరువలేనిది మా స్నేహం.

– హారిక, పీడీ

### వ్యక్తిత్వం తెలుసుకున్నాకే..



స్నేహం చేసే ముందు యువతీయువకులు ఎదుటి వారి వ్యక్తిత్వం పూర్తిగా తెలుసుకోవాలి. అప్పుడే స్నేహితులుగా మారాలి. ప్రస్తుతం కొందరు అవసరం కోసం స్నేహం చేసి.. తీరాక వదిలేస్తున్నారు. స్నేహం పేరుతో పరిచయమై తర్వాత మోసం చేసే వారిపై యువతులు జాగ్రత్తగా ఉండాలి. అవసరాన్ని బట్టి స్నేహం చేయడం కాదు. అవసరాలను తీర్చే వారే నిజమైన స్నేహితులు.

– శారద, ప్రిన్సిపాల్

### ఏదైనా సాధించొచ్చు



ఏదైనా సాధించాక గుర్తించేది లోకం. ‘సాధిస్తావ్’ అని నమ్మేది కుటుంబం. ‘ఏదైనా సాధించగలవు’ అనే నమ్మకాన్నిచ్చేది స్నేహం. నేను మా స్నేహితులు గాయత్రి, దివ్యరాణి, శిరీష ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధిస్తున్నాను.

– వాణిశ్రీ

### ధైర్యం వెంటే ఉన్నట్టు..



స్నేహితులుంటే ధైర్యం వెంటే ఉన్నట్లుంటుంది. తల్లిదండ్రులకు చెప్పుకోలేని కొన్ని విషయాలు స్నేహితులతో పంచుకుంటాం. కష్ట, సుఖాల్లో తోడుగా ఉండేది స్నేహితులే. మా కాలేజీలో మేమంతా ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉంటాం.

– సంగీత

# పరారీలోనే సర్వేయర్ భరత్

- నేటికీ ఆచూకీ లభించని వైనం
- కొన్నాళ్లు జీడిమెట్లలో మకాం..
- పోలీసులు పసిగట్టగా పరారీ
- రాజస్థాన్‌లో ఉన్నట్లు సమాచారం
- ఏసీబీ అధికారుల ఉదాసీనతతోనే..



సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మంజూరైన రూ.4.30 కోట్ల పరిహారంలో అక్రమాలు జరిగిన విషయం తెలిసిందే. అక్రమాలకు పాల్పడిన అప్పటి ఆసిఫాబాద్ ఆర్డీవో సిడాం దత్తు, డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) మెస్రం నాగోరావు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సుబ్బ శంభుదాస్, లక్ష్మీనారాయణగౌడ్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. కానీ.. మరొక నిందితుడు సర్వేయర్ భరత్‌ను మాత్రం నేటికీ పట్టుకోలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**భరత్ లీలలెన్నో..?**

జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆసిఫాబాద్ మండల సర్వేయర్‌గా వచ్చిన భరత్ ఎన్నో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో భూములకు రెక్కలు రావడంతో ఇక్కడి రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా భూ కొలతలు చేపట్టి పాత నక్షాల స్థానంలో కొత్త వాటిని రికార్డుల్లోకి ఎక్కించినట్లు తెలిసింది. గుండికి వెళ్లే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కోవాల్కర్ తారాబాయికి చెందిన సర్వేనంబర్ 66/బీలోని 2.20 ఎకరాల స్థలాన్ని ఆమెది కాదంటూ సర్వేయర్ భరత్ సర్వేనంబర్లు మార్చి రికార్డులు తారుమారు చేశాడని బాధితురాలు రెండేళ్ల కిందట కోర్టుకెక్కిన సంగతి విదితమే. ఆమెకు చెందిన సర్వే నంబర్ వెనుక భాగంలో ఉందని.. ముందున్న స్థలం శంభుదాస్ డ్రైవర్ పోరాల తిరుపతి, సోమసుందర్ అనే వ్యక్తులకు చెందినదిగా వారి సర్వేనంబర్లను రహదారికి ఆనుకుని ఉన్నవిగా చూపి.. ఆమెను మోసం చేసే ప్రయత్నం చేశారు. అలాగే కొత్త ఎస్పీ కార్యాలయం వెనుకభాగంలోనూ ఓ వెంచర్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని అందులో కలిపేసి కొలతలు తారుమారు చేసిన ఆరోపణలున్నాయి. ప్రస్తుతం అధికారపార్టీ నేతలకు చెందిన ఓ వెంచర్‌కూ భారీ స్థాయిలో మేలు చేసి.. రూ.లక్షల్లో మామూళ్లు తీసుకున్నారని స్థానిక రియల్‌ఎస్టేట్ వ్యాపారులు బహిరంగంగా చర్చించుకున్నారు. ఇలా భరత్ లీలలు ఎన్నెన్నోనని రెవెన్యూ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఏసీబీ ఉచ్చు బిగిస్తోందని తెలియగానే పరారీలో ఉన్న సర్వేయర్ కొన్నాళ్లపాటు రాజధాని ప్రాంతంలోని జీడిమెట్లలో తలదాచుకున్నట్లు తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకునేలోపు భరత్ పరారయ్యారు. ఆ తర్వాత భరత్ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయడం.. తరువాత ఎలాంటి ఫోన్ వాడకపోవడంతో అతడి ఆచూకీ తెలుసుకోవడం ఏసీబీ అధికారులకు కష్టంగా మారింది. ఏసీబీ అధికారులు కూడా ప్రభుత్వ ఉద్యోగి ఎక్కడికి పోతాడు? అన్న ధోరణిలో ఉదాసీనత ప్రదర్శించడంతో 37 రోజులుగా భరత్ ఆచూకీ దొరక్కుండా తిరగడం గమనార్హం. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు ప్రస్తుతం భరత్ రాజస్థాన్‌లో ఉంటున్నట్లు తెలుస్తోంది. భరత్ ఆచూకీ కనిపెట్టకపోవడం వెనుక కారణాలేమిటని ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తిని ‘సాక్షి’ ప్రశ్నించగా.. అతడి ఇంటి ఆచూకీ తెలియకపోవడంతోనే భరత్‌ను పట్టుకోలేకపోయామని సమాధానమిచ్చారు.

### నేటికీ పరారీలోనే..

37 రోజులుగా సర్వేయర్ భరత్ ఏసీబీ అధికారుల కళ్లుగప్పి తిరుగుతున్నాడు. ఆచూకీ కనిపెట్టేందుకు ఏసీబీ ఉన్నతాధికారులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతోనే అతను పరారీలో ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వేయర్ భరత్ ఈ కేసులో ఎంతో కీలకం. రహదారి విస్తరణలో ఎవరెవరు భూములు కోల్పోయారు? ఎంత విస్తీర్ణం? అన్న వివరాలన్నింటినీ రికార్డుల్లో పొందుపరచడంలో సర్వేయర్ భరత్ పాత్ర కీలకంగా ఉంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న సర్వేయర్.. ల్యాండ్‌అక్విజేషన్ ప్రక్రియలో ప్రధానపాత్ర పోషించిన అధికారులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై పరిహారంలో అక్రమాలకు పాల్పడినట్లు ఏసీబీ అధికారుల విచారణలో వెలుగుచూసిన సంగతి తెలిసిందే. పరిహారంలో అక్రమాలు జరిగిన విషయాన్ని రియల్‌ఎస్టేట్ వ్యాపారి డ్రైవర్‌గా పనిచేస్తున్న పోరాల తిరుపతి ఏసీబీ అధికారులను స్వయంగా కలిసి ఫిర్యాదు చేయడమే కాకుండా కేసులో అప్రూవర్‌గా మారడంతో ఈ అక్రమాల భాగోతం వెలుగుచూసింది. కేసు విచారించిన ఏసీబీ అధికారులు జూన్ 29న నిందితులను అదుపులోకి తీసుకోగా.. కరీంనగర్ జైలులో ఉంటున్న శంభుదాస్, లక్ష్మీనారాయణగౌడ్‌కు శుక్రవారం సాయంత్రం హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క సూచించారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి భట్టి, భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి రెవెన్యూశాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ నుంచి రాష్ట్ర మున్సిపల్ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, భూపరిపాలన కమిషనర్ నవీన్ మిట్టల్, ఇతర కార్యదర్శులతో కలిసి వేర్వేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో ప్రత్యేక కమిటీలు వేసి క్షేత్రస్థాయిలో దరఖాస్తులు పరిశీలించనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ భూముల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావ్, సురేశ్, మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావ్ ఉన్నారు.

# దోస్త్.. మేరా దోస్త్..




ఆస్తులను ఆర్జించినవాడు కాదు.. అప్పులను సంపాదించుకున్నవాడు నిజమైన అదృష్టవంతుడు. ఎవరి సమక్షంలో మన బాధలు సగం అవుతాయో.. ఎవరి కారణంగా మన ఆనందం రెట్టింపు అవుతుందో వారే అసలైన స్నేహితులు. ప్రపంచం అంతా నిన్ను వదిలిపెట్టినా నీకు తోడుండేవాడే నిజమైన స్నేహితుడు. మానవ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలతో ముడిపడుతున్న ఈ ఆధునిక కాలంలో స్వచ్ఛమైన స్నేహం కోసం తాపత్రాయపడే వాళ్లెందరో ఉన్నారు. యాంత్రిక జీవనంతో ఉరుకులు, పరుగులతో కాలం వెళ్లదీస్తున్న చాలామందికి ఊరటనిచ్చే అంశం.. ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి నవీన ప్రచార మాధ్యమాలతో ఆత్మీయ మిత్రుల సందేశాలే కలిమి లేముల్లో నేనున్నాను.. అనే విశ్వాసం ప్రకటించే మిత్రులను సంపాదించుకున్న వాళ్లు నిజంగా ధన్యులు. తడి హృదయంతో పొడిబారని వాక్యాలతో, ఆర్ద్రత పంచేవాళ్లు..మనతోపాటు నడిచినంతమేర నవ్వులపువ్వులు పూయించేవాళ్లే స్నేహితులంటే.. ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

## ఆస్తులు లేకున్నా..



చెన్నూర్: నేను హన్మకొండలో 1994లో ఇంటర్ చదువుతుండగా ఇజిగిరి పెద్దన్న అనే మిత్రునితో స్నేహం ఏర్పడింది. ఇద్దరం కలిసి డిగ్రీ, పీజీ పూర్తి చేశాం. 2004లో నేను ఎస్సైగా సెలెక్ట్ అయ్యా. పెద్దన్న ప్రభుత్వ ఉపాధ్యాయునిగా వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రంగాపూర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. వృత్తి రీత్యా వేరు వేరు శాఖలు అయినప్పటికీ నిత్యం ఫోన్‌లో మాట్లాడుకుంటాం. ఆస్తులు లేకున్నా మంచి స్నేహితులుంటే ఏదైనా సాధించవచ్చు. – రవీందర్, సీఐ, చెన్నూర్

## ఆపదలో ఆదుకున్నవాడే..



ఆసిఫాబాద్: స్నేహం ఎంతో విలువైనది. ఆపదలో ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడు. నిజమైన స్నేహితుడు కష్టాల్లో దూరం కాకూడదు. స్వచ్ఛమైన ప్రేమ ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటా.

– ప్రభాకర్ రావు, అదనపు ఎస్పీ

## వారానికోసారి కలుస్తాం



బెల్లంపల్లి: స్నేహమనేది ఓ మధురమైన అనుభూతి. ఓవరం లాంటిది. దీనికి వర్ణ, వర్గ, లింగ, జాతి, వయస్సు, స్థాయి, కులాలతో పనిలేదు. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ప్రతీ మనిషి జీవితంలోనూ స్నేహం అందమైన తీగలా అల్లుకుపోతుంది. అమ్మ అనే పదం తర్వాత ఆత్మీయతను ధ్వనింపజేసే ఏకైక పదం స్నేహం. కేకే రావు, మోహన్‌రెడ్డి ఇద్దరూ నాకు బెస్ట్ ఫ్రెండ్స్. చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నాం. వారి ప్రోత్సాహం, సలహాలు, సూచనలు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి. వ్యాపార రంగంలో వారు, రాజకీయ రంగంలో నేను ఎంత బిజీగా ఉన్నా వారానికో సారి కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటాం. అందరం స్నేహభావంతో ఉందాం. నియోజకవర్గ ప్రజలందరికీ స్నేహితుల రోజు శుభాకాంక్షలు.

– గడ్డం వినోద్, బెల్లంపల్లి ఎమ్మెల్యే

## 50 ఏళ్లుగా కలిసి మెలిసి..



ఆసిఫాబాద్‌అర్బన్: వీరంతా ప్రస్తుతం 65 సంవత్సరాల వయస్సు పైబడినవారే. ఉద్యోగ విరమణ చేసి కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా గడుపుతున్నారు. వీరి స్నేహానికి 50 సంవత్సరాలు నిండింది. 1వ తరగతి నుంచి వీరు కలిసి మెలిసి ఉంటున్నారు. వారిలో ఎవరి ఇంట్లోనైనా ఏదైనా కార్యక్రమం జరిగితే మిగతా వారంతా ఎన్ని పనులున్నా వదులుకుని వస్తారు. అలా కలుసుకున్నప్పుడు వారి సంతోషాన్ని మాటల్లో చెప్పలేం. ఇందులో ఒకరు వారణాసి కిషన్‌రావ్ (హైదరాబాద్), నిమ్మకంటి రమేశ్,(హైదరాబాద్), వైద్య పూర్ణచందర్ రావ్ (ఆసిఫాబాద్), జయప్రకాశ్ (హైదరాబాద్), విద్యాసాగర్(ఆసిఫాబాద్).

## స్నేహానికే అర్థం మాస్నేహం



స్నేహానికే అర్థం మాస్నేహం. మేమిద్దరం చిన్న వయస్సులో కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ కాలనీలో నివాసం ఉండేవాళ్లం. మా ఇద్దరి తండ్రులు సర్‌సిల్క్‌లో పనిచేస్తుండేవారు. అతి తక్కువ వేతనంతో ఆర్థికంగా చాలా ఇబ్బంది పడ్డాం. కష్టాలు అధిగమించడానికి ఉన్నత చదువులు చదివాం. ప్రస్తుతం రాంబాబు అమెరికాలో ఓ కంపనీకి మేనేజర్‌గా పని చేస్తున్నాడు. నేను (సురేష్‌కుమార్) ఆసిఫాబాద్ జిల్లా వెటర్నరీ అధికారిగా పని చేస్తున్నా. మా ఇద్దరిలో ఎవరికి కష్టం వచ్చినా ఒకరినొకరు సంప్రదించుకుని సమస్య పరిష్కరించుకుంటాం. – సురేష్‌కుమార్, రాంబాబు



భోగి వేడుకల్లో సభ్యులు (ఫైల్)

## నడక కలిపింది..

మంచిర్యాలఅర్బన్: ఆరేళ్ల క్రితం వారంతా పరిచయం లేనివ్యక్తులే. నిత్యం మంచిర్యాల బాయ్స్ స్కూల్ మైదానానికి వాకింగ్‌కు వస్తుండేవారు. అలా ఒక్కొక్కరితో మొదలైన స్నేహం 50 మంది పరిచయానికి దారితీసింది. అలా వాకింగ్‌తో మొదలైన స్నేహం ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటు వరకు కొనసాగింది. పండుగ వేడుకలు కలిసికట్టుగా గ్రౌండ్‌లో జరుపుకుంటారు. నెలకు రూ.500 చొప్పున జమచేసి అందులోంచి సరదాలకు ఖర్చు పెడుతుంటారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, నోట్‌బుక్స్ అందజేస్తున్నారు. ఇలా ఆరేళ్ల కిందట వాకింగ్‌తో కలిసిన స్నేహం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

## స్నేహానికి చిహ్నంగా సోపతి సొసైటీ..



సోపతి సొసైటీ మిత్రబృందం

జైపూర్: జైపూర్ హైస్కూల్ 1998–1999 పూర్వవిద్యార్థుల సమ్మేళనం వేదికగా 2016లో ఏర్పడ్డ సోపతి సొసైటీ స్నేహానికి చిహ్నంగా నిలుస్తోంది. తమతో చదువుకున్న జాడి భానేశ్ అకాల మృతితో ఏర్పడిన సోపతి సొసైటీ వందమంది మిత్రబృందంతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతోంది. రక్తదానం, తలసేమియా, సికిల్‌సెల్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. మరణించిన స్నేహితుల కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తూ అండగా ఉంటున్నారు. అకాల వర్షాలకు ఇళ్లు కూలిపోయిన నిరుపేదలకు సైతం ఆర్థికసాయం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. 120 మంది మిత్రబృందంలో 20 మంది మృతిచెందగా 100 మంది కొనసాగుతున్నారు.

## ఊరి కోసం.. ఆ ఐదుగురు

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన కల్లెం రాజన్న, అప్పాల సునీల్, బక్కంశెట్టి వెంకటేష్, లక్కాకుల వెంకటేష్, మాదాసు వెంకటేష్ ఐదుగురు మిత్రులు. వారిలో నలుగురు ప్రభుత్వ, ఒకరు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సదుద్దేశంతో హెల్పింగ్ హ్యాండ్స్ పేరిట గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి, మృతుల కుటుంబాలకు ఆపత్కాలంలో ఆర్థికసాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

## నిలువెత్తు నిదర్శనం..



మిట్ట జలపాతం వద్ద స్నేహితుల సెల్ఫీ

లక్ష్మణచాంద: ఆ ముగ్గురిదీ విడదీయరాని బంధం. ఒకరిని విడిచి మరొకరు ఉండలేనంతగా కలిసి మెలిసి ఉంటారు. ఒకరు నిర్మల్ జిల్లా చించోలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న అన్నపూర్ణ, మరొకరు కుభీర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కే.హంసలత, వానల్‌పాడ్ పంచాయతీ కార్యదర్శి గాయత్రి. సెలవు దొరికితే చాలు ఆ ముగ్గురు ఏదైనా నూతన ప్రదేశానికి వెళ్లి ఉల్లాసంగా గడుపుతారు. తమ స్నేహానికి పదేళ్లు నిండాయని వారు పేర్కొంటున్నారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటూ స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు.

## ఆదర్శ స్నేహితులు..!

కుంటాల: మండల కేంద్రానికి చెందిన 2004–05 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదర్శ యూత్‌గా ఏర్పడి తమ స్నేహితులను ఆపదలో ఆదుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సామాజిక సేవతో పాటు గ్రామంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారు. కుంటాలకు చెందిన నెమలికొండ సురేష్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.50వేలు, మిత్రుడు రమణ తల్లి గంగవ్వ మృతి చెందగా రూ.20,100 ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

## ఆపదవస్తే ఆదుకుంటాం..



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

జన్నారం: మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్నేహభావం చాటుతున్నారు. వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారు. తంగళ్లపల్లికి చెందిన రాజన్న భార్య అనారోగ్యం బారిన పడడంతో రూ.60 వేలు, పొనకల్‌కు చెందిన శ్రీనివాస్ కుమార్తె చదువుకోసం రూ.26 వేలు, సేవదాస్‌నగర్‌కు చెందిన స్నేహితుని కుమార్తె వివాహానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. మా బ్యాచ్‌లో ఎవరికి ఆపద వచ్చినా ఆదుకుంటామని ఫజల్‌ఖాన్, గొల్లపెల్లి వెంకటరమణ, రాజన్న, మస్కూద్, ఓదెలు పేర్కొంటున్నారు.

## పాతికేళ్ల సుమగంధం...



నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన పెందోట వంశీకృష్ణ, దిలావర్‌పూర్ మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందిన కారగిరి గంగయ్య మధ్య 2000 సంవత్సరంలో ఏర్పడిన స్నేహబంధం పాతికేళ్లుగా కొనసాగుతోంది. గంగయ్య జిల్లా కేంద్రంలోని కోర్టులో పోలీస్ కానిస్టేబుల్‌గా, వంశీకృష్ణ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.ఎన్నో పరిచయాలు ఎక్కడ ఓచోట ఆగిపోతున్న ప్రస్తుత తరుణంలో దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం చిగురించిన స్నేహబంధం మరిన్ని కాలాలపాటు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు. – వంశీకృష్ణ, గంగయ్య

## వెలకట్టలేనిది..



మంచిర్యాలక్రైం: కష్టసుఖాల్లో పాలుపంచుకునేవాడే నిజమైన స్నేహితుడు. స్నేహం అంటే అహం, స్వార్థంలేకుండా ఉండాలి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో పరిచయమైన స్నేహం నిజమైన స్నేహం కాదు. స్నేహితులు ఒకరికొకరు తోడుగా ఉండాలి. ప్రపంచంలో వెల కట్టలేనిది స్నేహం ఒక్కటే. ప్రతి ఒక్కరికీ ఒక మంచి స్నేహితుడు ఉండాలి. – ఎగ్గడి భాస్కర్, డీసీపీ మంచిర్యాల

## 45 ఏళ్ల స్నేహబంధం...



భైంసాటౌన్: పట్టణానికి చెందిన దాసరి సురేశ్, జి.సదానందంలది 45ఏళ్ల స్నేహబంధం. సురేశ్ స్థానికంగా వ్యాపారం చేస్తుండగా సదానంద్ గౌడ్ ప్రభుత్వ ఫార్మసిస్ట్‌గా పని చేస్తున్నారు. వృత్తిరీత్యా సాయంత్రం వరకు ఎవరి పనిలో వారున్నా.. ప్రతిరోజు సాయంత్రం ఒక్కసారైనా కలుసుకుంటారు. వీరిని చూసిన ఎవరైనా ఒకరిని విడిచి మరొకరు ఉండరని అంటుంటారు. ఏటా స్నేహితుల దినోత్సవం ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటామని పేర్కొన్నారు. – సదానంద్‌గౌడ్, సురేశ్

## చదువులోనూ.. వృత్తిలోనూ



ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన రావుల సరిత, హారికలు చిన్ననాటి మిత్రులు. వీరి స్నేహం పాఠశాల స్థాయిలో మొదలై ఇప్పటికీ ఎలాంటి అరమరికలు లేకుండా సాగుతోంది. చిన్న చిన్న మనస్పర్థలకే బంధాలను తెంచుకుంటున్న ప్రస్తుత సమాజంలో వీరి స్నేహం 30 సంవత్సరాలుగా కొనసాగుతోంది. పాఠశాల, ఇంటర్, డిగ్రీతో పాటు ఎల్‌ఎల్‌బీ సైతం కలిసి చేశారు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని న్యాయస్థానాల్లో న్యాయవాద వృత్తిని కొనసాగిస్తున్నారు. –హారిక, సరిత

## పోస్టల్ ఉద్యోగం రాదేమోనని ఆత్మహత్య

పెంబి: పోస్టల్ ఉద్యోగం రాదేమోనని మనస్తాపంతో విద్యార్థి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. మండలంలోని అంకెన పంచాయతీ పరిధిలోని బుర్కరేగడి గ్రామానికి చెందిన నైతం జంగు–చంపాబాయి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇందులో పెద్దకుమారుడు దత్తురాం (19) పోస్టల్ ఉద్యోగం రాదేమోనని మనస్తాపంతో గురువారం సాయంత్రం ఇంటి పక్కన ఉన్న పొలంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చి పడిపోగా తండ్రి నైతం జంగు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## తండ్రిని హత్య చేసిన తనయుడి అరెస్టు

కడెం: తండ్రిని హత్య చేసిన తనయుడిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ నవీన్ కుమార్ తెలిపారు. ఖానాపూర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో ఈనెల 2న తనయుడు తండ్రిని హత్యచేసిన విషయం తెలిసిందే. మద్యానికి బానిసైన తండ్రి కుడిమేత మధు ఇంట్లో వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో భార్య, పెద్దకుమారుడు అనిల్, కోడలిని ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. శుక్రవారం ఇంటికి వచ్చిన అనిల్‌ను ఎందుకచ్చావని మధు గొడవపడ్డాడు. ఈ క్రమంలో అనిల్ తన వెంట తెచ్చుకున్న కర్రతో మధు తలపై మోది హత్య చేశాడు. శనివారం ఉదయం బెల్లాల్ గోదావరి సమీపంలో నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

## భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

దండేపల్లి: భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన ఈర్ల అశోక్ (34)కు బాల్కొండకు చెందిన గంగసోనితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. దంపతులఆమె కు ఒక కుమారుడు సంతానం. ఐదేళ్ల క్రితం గంగసోని భర్తను వదిలి కొడుకును తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన అశోక్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇంటి సమీపంలో గల బావి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- నస్పూర్ యువకుడు మృతి



సాయినివాస్ (ఫైల్)

శ్రీరాంపూర్: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నస్పూర్, నాగార్జున కాలనీకి చెందిన యువకుడు మృతి చెందాడు. కాలనీకి చెందిన పెట్టం శ్రీనివాస్, సువర్ణ దంపతుల కుమారుడు సాయి నివాస్ (25) గచ్చిబౌలిలోని ఓప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. రాత్రి షిఫ్ట్ ముగించుకుని శనివారం ఉదయం బైక్‌పై రూంకు వెళ్తుండగా రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హెల్మెట్ పెట్టుకుని ఉంటే ప్రాణాలు దక్కేవని సంఘటను చూసిన వారు పేర్కొంటున్నారు.

## 'గురుకులం'లో విద్యార్థినికి విద్యుత్‌షాక్



చికిత్స పొందుతున్న వైష్ణవి

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల డిగ్రీ కళాశాల(టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ)లో శుక్రవారం రాత్రి విద్యార్థిని విద్యుత్‌షాక్‌కు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కళాశాలకు చెందిన వైష్ణవి ల్యాప్‌టాప్ చార్జింగ్ పెట్టేందుకు ఇన్వర్టర్ ప్లగ్ తీసి పెట్టే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురికావడంతో సిబ్బంది ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం బయటకు పొక్కకుండా అధ్యాపకులు జాగ్రత్త పడిన ట్లు తెలుస్తోంది. విద్యార్థిని పరిస్థితి నిలకడగానే ఉందని ఒకటి, రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేయనున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపా యి. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులో లేకుండా పోయారు.

## రైలు కిందపడి వ్యక్తి మృతి

సిర్పూర్(టి): మండలంలోని అచ్చెల్లి గ్రామానికి చెందిన గొల్ల భీంరావ్ (45) శనివారం సాయంత్రం అచ్చెల్లి గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబల్ సురేష్ తెలిపారు. సాయంత్రం సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా చండీఘర్ నుండి మధురై వెళ్లే రైలు కిందపడి మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు పంచనామా నిర్వహించి సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

## రేపు ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలో సోమవారం విద్యుత్ ఉద్యోగులకు ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్ఈ జయవంత్‌రావు చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. భుక్తాపూర్‌లోని శాఖ అతిథి గృహంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు క్యారమ్, డైట్ మైదానంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాలీబాల్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. గెలుపొందినవారు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

## గిరిజన యువతకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు డాక్టర్ రెడ్డి ల్యాబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్‌లోని శిక్షణ కేంద్రంలో 3 నెలల పాటు వివిధ కోర్సుల్లో శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎలక్ట్రికల్, మెకానిక్‌లో ఐటీఐ, డిప్లొ మా అర్హత కలిగిన 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ వెహికిల్ మెయింటనెన్స్ టెక్నీషియన్ కోర్సుల్లో 3 నెలలు, కంప్యూటర్ సైన్స్‌లో బీసీఏ, బీఎస్సీ అర్హత కలిగిన వారికి ఫుల్ స్టాక్ డెవలపర్ కోర్సుల్లో 3 నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 5 నుంచి 10వ తేదీలోగా ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9010295910, 9666748105, 94935 35052 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## నూతన నియామకం



రాజేశ్వరి

దండేపల్లి: ఆదివాసీ నాయకపోడు హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా దండేపల్లి మండలం కర్ణపేట మాజీ సర్పంచ్ మారినేని రాజేశ్వరి నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఆదివాసీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, జిల్లాలో నూతన కమిటీల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

## ఎల్లో, రెడ్ కార్డు విధానం రద్దు చేయాలి

శ్రీరాంపూర్: మైనింగ్ స్టాఫ్ సూపర్‌వైజర్లను ఇబ్బంది పెట్టే ఎల్లో కార్డు, రెడ్ కార్డు విధానం రద్దు చేయాలని బీఎంఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, కేంద్ర కార్యదర్శి రాగం రాజేందర్, బ్రాంచి కార్యదర్శి కే.ఈశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో సంస్థ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే సూపర్‌వైజర్లపై క్రమశిక్షణ పేరుతో, సేఫ్టీ ఉల్లంఘన పేరుతో యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, నేడు కొత్తగా ఈకార్డులను తీసుకువచ్చి వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని, ఈ విధానం మానుకోవాలని కోరారు.

## స్త్రీనిధి రుణ వసూళ్లలో అవకతవకలు!

- విచారణ జరిపిన ఆర్‌ఎం



విచారణ జరుపుతున్న ఆర్‌ఎం, ఏపీఎం

దండేపల్లి: అధికారుల పర్యవేక్షణ లోపంతో స్త్రీనిధి రుణ వసూళ్లలో పలు అవకతవకలు జరిగిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. దండేపల్లి మండలం మేదరిపేటలో దివ్య వీవోలో 103 మంది సభ్యులకు స్త్రీనిధి ద్వారా మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌కు, వ్యవసాయ అభివృద్ధికి, జనరల్ రుణాల కింద రూ.55 లక్షల వరకు మంజూరు చేశారు. చాలా మంది క్రమం తప్పకుండా వాయిదాల ప్రకారం రుణాలు చెల్లిస్తున్నారు. వారిలో కొందరికి ఆన్‌లైన్‌లో మాత్రం రుణాలు కట్టనట్లు కనిపించింది. మేము రెగ్యులర్‌గా కిస్తీలు కడుతున్నా ఆన్‌లైన్‌లో ఎందుకిలా కనిపిస్తుందని ఏపీఎంకు సమాచారం అందించారు. చెల్లించని వారికి, చెల్లించిన వారి డబ్బులనుంచి కొంత సర్దుబాటు చేసినట్లు ఆరోపణలు కూడా వ్యక్తమయ్యాయి. రుణాలు చెల్లించని వారినుంచి రికవరీ చేయడంలో అధికారులు అలసత్వం చేశారనే విమర్శలు వ్యక్తం అయ్యాయి. విషయం తెలుసుకున్న స్త్రీనిధి ఆర్‌ఎం వెంకటరమణ, దండేపల్లి శ్రీలక్ష్మీ మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ఏపీఎం బ్రహ్మయ్య, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ సితార, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనిత సమక్షంలో విచారణ చేపట్టారు. రుణాల వసూళ్లలో అవకతవకలు ఎలా జరిగాయి, ఎందుకు జరిగాయి అనే దానిపై ఆరా తీశారు. త్వరలో వీవో సమావేశం ఏర్పాటు చేసి, రుణాలు కట్టని వారినుంచి రికవరీ చేయాలని, ఇక ముందు ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని, అలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సింగరేణికి ప్రభుత్వ బకాయిలు చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.27 వేల కోట్లు వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వహయాం నుంచి ఈ బకాయిలు పేరుకుపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే బకాయిలు చెల్లిస్తారనుకుంటే ఇప్పటికి కూడా పైసా చెల్లించలేదన్నారు. అంతే కాకుండా సింగరేణి సొమ్మును దారి మళ్లిస్తున్నారన్నారు. నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేస్తేనే సంస్థకు భవిష్యత్ ఉంటుందని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు పెర్క్స్ పై పడే ఆదాయ పన్ను ప్రభుత్వమే చెల్లించాలని, కంపెనీ గత సంవత్సరం సాధించిన లాభాలను ప్రకటించి అందులో నుండి 35 శాతం కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, నాయకులు తిరుపతి, సాయి, రాజు, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల రికార్డులు సరిచూడాలి

శ్రీరాంపూర్: ఉద్యోగుల రికార్డులను సరిచూడాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఆర్‌లో ఉద్యోగులు, కుటుంబ సభ్యుల ఫొటోలను అప్‌డేట్ చేయాలని సూచించారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం కంపెనీ తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. అనంతరం గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యల గురించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం గోపాల్ సింగ్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఓసీపీ పీవో ఎం.శ్రీనివాస్, ఏజెంట్లు ఏవీ రెడ్డి, రాముడు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, రక్షణ అధికారి శ్రీధర్, సర్వే అధికారి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.